క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నింద్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తులు స్వామివారికి విశేష పూజలు చేపట్టి, స్వామివారిని దర్శించుకున్నారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తర నక్షత్ర పూజలు


సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను పఠిస్తూ అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు భజనలు చేయగా, ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. కార్యక్రమంలో ఉభయదారులుగా కె.నందిని, వేలుఆచారి, దాక్షాయణి, జయచంద్రారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పరిశీలన


అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


పాలసముద్రం: గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు మంజూరై అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ దాము తెలిపారు. శనివారం వారు సర్పంచ్ గాలి మహేష్‌బాబుతో కలిసి శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడను సందర్శించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న వాటిని గుర్తించారు. అనంతరం వారు గృహ నిర్మాణదారులతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న ఇంటి పనులను పూర్తి చేసుకోవడానికి డ్వాక్రా సంఘాల్లో తక్కువ వడ్డీకే రూ.లక్ష వరకు అప్పుగా ఇస్తున్నారని తెలిపారు. అందువల్ల వీటిని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, జేఈ అనుషా, సీసీ, సంఘమిత్ర, వలంటీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హేమసుందర్‌రెడ్డికి సన్మానం


హేమసుందర్ రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: డాక్టరేట్ పురస్కార గ్రహీత వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డిని అధికారులు శనివారం ఘనంగా సన్మానించారు. పారిశ్రామిక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనతో పాటు సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి ఇటీవల శ్రీ విశ్వవిజ్ఞాన సంస్థ హైదరాబాద్ వారు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా శనివారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుధాకర రావు ఆధ్వర్యంలో హేమసుందర్ రెడ్డికి దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మురళి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి


మురుగునీటిని తొలగిస్తున్న కార్మికులు

కార్వేటినగరం: పారిశుద్ధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. శనివారం వేణుగోపాలస్వామి మాడవీధుల్లో పంచాయతీ ఈఓపీఎస్ మణితో కలసి పారిశుద్ధ్యాన్ని మెరుగు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రజలు సహకరించాలని కోరారు. వీధుల్లో మురుగు నీరు ప్రవహించకుండా, తాగునీరు ఉధృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రాస్ వృద్ధాశ్రమం వద్ద నిలిచిన మురుగునీటిని కార్మికులు తొలగించారు.

స్వాతంత్ర్య సమరయోధులే మనకు స్ఫూర్తి

- ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోండి
- నా భూమి – నా దేశం కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా


అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. శనివారం పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ శిలాఫలకాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి రోజా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన నా భూమి – నాదేశం కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం జగనన్న పూర్తి సహకారం అందించారన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రిగా తాను అన్ని జిల్లాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈరోజు మనమంతా స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామంటే అది కేవలం సమరయోధుల త్యాగ ఫలితమన్నారు. వారి రుణం తీర్చుకునే విధంగా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుని రోజువారి కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులచే పిడికిలి మట్టిని చేత పట్టి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా మేనేజర్ ప్రమీలా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్, ఎంఎల్ఓ దిలిప్‌మొదలి, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, పాఠశాల హెచ్ఎం భువనేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు పాలాభిషేకం చేశారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడుతూ తమ కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి రోజాను గజమాలతో సత్కరించారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి రోజా, అధికారులు, నా భూమి- నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ నాశనం




సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, హాజరైన విద్యార్థులు

- మార్గదర్శకాలు విడుదల చేసిన సుప్రీంకోర్టు
- సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విడుదల చేసిందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర స్పష్టం చేశారు. శనివారం స్థానిక శ్రీవెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని కళాశాల నుంచి డిస్మిస్ చేయడం జరుగుతుందని, తర్వాత ఏ ఇతర కళాశాలలోనూ అడ్మిషన్ ఉండదని స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్‌ను నాశనం చేసే ర్యాగింగ్‌తో పాటు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని చెప్పారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జానకి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల శిక్ష నుంచి జీవిత ఖైదు విధించే అవకాశం ఉందని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సదస్సులో న్యాయవాదులు మురగేశన్‌రెడ్డి, సంజీవి, కళాశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు



గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలం చిన్నవేపంజేరి గ్రామానికి చెందిన ఆనందరెడ్డి కుమార్తె ఎం.విజయ, వీఐటీ యూనివర్సిటీలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

వేడుకగా పీర్ల పండుగ


వలీస్ దేవున్ని పూలతో అలంకరించి ఊరేగిస్తున్న ముస్లింలు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెంలో ముస్లింలు పీర్లపండుగను ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం ముస్లింలు తమ మసీదులో పీర్లను పుష్పాలతో అలంకరించారు. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పీర్లస్వామిని దర్శించుకున్నారు.

హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీ ఆరిమానిగంగమ్మ ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించగా అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,48,808 వచ్చినట్లు ఆలయ ఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను, ముడుపులను సంవత్సరానికి నాలుగుసార్లు లెక్కిస్తామన్నారు. ఆలయానికి వచ్చే ఆదాయంతో పాటు ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ.1.85 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో కేంద్ర పర్యటకశాఖ ఆలయాన్ని సందర్శించి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఆలయ చైర్మన్ లింగారెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఆహారంతో మెరుగైన ఆరోగ్యం


మాట్లాడుతున్న ప్రకృతి వనం ప్రసాద్


సదస్సుకు హాజరైన ప్రజలు

పుత్తూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రకృతి వనం ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ప్రకృతి ఆహారంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రకృతి వనం ప్రసాద్ మాట్లాడుతూ పదిమందికి సహాయపడడం ద్వారా, మనసుకు నచ్చిన పనులు చేయడం ద్వారా మానవుని శరీరంలో హ్యాపీ హార్మోన్స్ ఉత్పత్తి అవుతాయని తెలిపారు. ఇవి మనిషి మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా భూమి సారవంతాన్ని కోల్పోతుందని ఫలితంగా పంటలో నాణ్యత లోపిస్తుందన్నారు. అదే సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటల్లో పోషకాలు మెండుగా ఉండి ఆరోగ్యాన్ని అందిస్తాయని వివరించారు. సిరిధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సామలు, కొర్రలు, ఊదలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. గూట్లో దీపం–నోట్లో ముద్ద అన్న పెద్దల మాట అక్షర సత్యమన్నారు. సాయంత్రం 6 గంటలకే రాత్రి భోజనాన్ని పూర్తి చేయాలని సూచించారు. రాత్రివేళల్లో సీజనల్ పండ్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం దరి చేరుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త శోభారాజ, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, నాయకులు శ్రీనివాసరావు, చంద్రమోహన్, గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, కుప్పయ్య పాల్గొన్నారు.

మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి ఆర్‌కే రోజా


సంక్షేమ బుక్‌లెట్ అందిస్తూ ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని సత్రవాడ వినాయకపురంలో శనివారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు గజమాలలు, దుశ్శాలువలు కప్పి హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు పర్యటించిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాశితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నానన్నారు. తన భర్త నేత సామాజివర్గానికి చెందినవారే అని తాను ఆ సామాజిక వర్గపు ఆడపడుచునే అన్నారు. ఆప్కోకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వ యూనిఫాం తయారీని ముఖ్యమంత్రితో చర్చించి స్థానిక మరమగ్గ కార్మికులకు ఇవ్వడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో ఆ ఆర్డర్లు ఎంతో మంది మరమగ్గ కార్మికులకు ఉపాధి ఇచ్చాయన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో మరమగ్గ కార్మికులను ఆదుకుంటున్నామని తెలిపారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమైన వారిని గుర్తించి న్యాయం చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

చంద్రబాబువి అసత్య ఆరోపణలు..

చంద్రబాబు తన హయాంలో చెప్పుకునేలా చేసిందేమీ లేనందున నిస్పృహకు గురయ్యారని, ప్రజలను అయోమయం చేసేందుకు అసత్య ఆరోపణలు, ఉద్రేకపూరిత ప్రసంగాలు చేస్తూ రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతను, ఆ దిశగా అమలు చేసిన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా విశదీకరించారు. పిల్లలను బడికి పంపే ఏ తల్లి కూడా ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అమ్మఒడితో పాటు జగనన్న విద్యాకానుక, విద్యా, వసతిదీవెన, విదేశీ విద్య తదితర పథకాలను సీఎం అమలు చేస్తున్నారని వివరించారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మార్చిన విషయాన్ని గుర్తు చేయాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందన్నారు. మేలు చేసిన వారిని గుర్తుంచుకుంటే అభివృద్ధికి బాటలు వేసినవారవుతారని తెలిపారు. ప్రజలు చెప్పిన సమస్యలను విన్న ఆమె గడప గడపకు నిధుల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేత అనుబంధశాఖ అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెప్మా టీఎల్ఎం సునీత, కౌన్సిలర్లు వెన్నెల, మురుగ, ఎన్‌సీ ఆనంద్ కుమార్, నాయకులు జగన్, అయ్యప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యాఘ్రంపై ద్రౌపదీదేవి విహారం



గెరిగె ఊరేగింపు, వ్యాఘ్రంపై విహరిస్తున్న ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పులి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగె నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు భాగవతారిణి సుమతి హరికథా గానం జరిగింది. రాత్రి 8గంటలకు గెరిగె ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జునస్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు గాండ్ల సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. రాత్రి 10 గంటలకు శ్రీబాలాజీ వీధి నాట్యకళాబృందం వారిచే కీచక వధ నాటకం శ్రోతలను అలరించింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ్‌పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

ఆదివారం ఉదయం 6 గంటలకు గెరిగె ఊరేగింపు. మధ్యాహ్నం 3 గంటలకు పాండవ కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం. రాత్రి 8 గంటలకు యాళి వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు.

వరి సాగుపై అవగాహన

నింద్ర: రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు ముందుగా పొలంలో పచ్చిరొట్ట సాగు చేస్తే పంట బాగా పండి లాభాలు వస్తాయని ఏఓ తులసీరాం తెలిపారు. శనివారం అగరం గ్రామంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో రైతులు వరి సాగు చేస్తే మేలన్నారు. అలాగే పంట సాగు సమయంలో వ్యవసాయ అధికారుల మెలకువలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆధునిక పద్ధతులతో పాటు యంత్రం సాయంతో వరినాట్లు వేయడం వల్ల కూలీల సమస్య ఉండదన్నారు. దీంతో ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడంతో పాటు విత్తనశుద్ధి కూడా ఎంతో అవసరమన్నారు. పొలాల్లో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై గ్రామస్తుల ఆగ్రహం


ఇసుక రీచ్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని ముక్కులతూరు ఇసుక రీచ్ వద్ద శనివారం రీచ్ నిర్వాహకులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. అక్రమ ఇసుక తవ్వకాలతో తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్లు శ్మశాన వాటికలను నాశనం చేస్తున్నారని గ్రామస్తులు ధర్నా చేశారు. ముక్కులతూరు రీచ్‌లో దాదాపు 15 అడుగుల లోతు వరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలను కూడా ఉల్లంఘించి అడ్డూ అదుపు లేకుండా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వేసి, తరలిస్తున్నారని ఆవేదన చెందారు. ఇలాగే కొనసాగితే నీవానది వంతెన దెబ్బ తినే ప్రమాదం ఉందని వాపోయారు. గతేదాది కురిసిన వర్షాలకు నీవానదిలో ప్రవాహం అధికం కావడంతో అప్పటి జిల్లా కలెక్టర్ ఇసుక తవ్వకాలను కిలోమీటరు దూరంలో తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ రీచ్ నిర్వాహకులు పట్టించుకోకుండా ఇష్టారీతిన ఇసుక తవ్వేస్తున్నారని తెలిపారు. విషయం తెలిసి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

భద్రత నిమిత్తమే వివరాల సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

నగరి: ముఖ్యమంత్రి విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి నగరి పట్టణానికి విచ్చేస్తున్నందున భద్రతలో భాగంగానే రోడ్‌షో జరగనున్న మార్గంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని సీఐ సురేష్ తెలిపారు. రోడ్‌షోలో భాగంగా దుకాణాలు మూసివేయాలంటూ తప్పుడు ప్రచారాలు ఊపందుకున్న నేపథ్యంలో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టత ఇచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగానే రోడ్‌షో జరిగే మార్గంలో ఇళ్లు, షాపులు ఎవరివి ఉన్నాయి. అందులో వారే కాపురం ఉంటున్నారా? లేక బాడుగలకు ఇచ్చారా? బాడుగకు ఇచ్చినట్లయితే వారు ఎప్పటి నుంచి అక్కడ ఉన్నారు ? అనే వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఎవరినీ దుకాణాలు మూసేయమని తాము చెప్పలేదన్నారు. 28న దుకాణాలు మూసివేయాలంటూ వస్తున్న వార్తలు నిజం కాదన్నారు. అలాగే పట్టణ పరిధిలో ఎవరైనా నూతన వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

• అన్నదానం


ఆలయంలో అన్నదానం చేపడుతున్న దాత, ఆలయ అధికారులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరం సీహెచ్‌సీలో విధులు నిర్వహించే డాక్టర్ లక్ష్మీపతి శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ లక్ష్మీపతి మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానమే మిన్న అని, పేదలకు అన్నం పెట్టడం మంచిదన్నారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ శృతి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వార్డు మెంబరుగా నాగరాజు గెలుపు


నాగరాజుకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఆర్‌ఓ

గంగాధరనెల్లూరు: మండలంలోని వరత్తూరు పంచాయతీ కాలేపల్లి వార్డు మెంబర్ 2 శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన నాగరాజు 48 ఓట్లతో ఘన విజయం సాధించారు. మొత్తం ఓట్లు 236 కాగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుకు 141, టీడీపీ బలపరిచిన అభ్యర్థికి 93, చెల్లని ఓట్లు 2 వచ్చాయి. గెలుపొందిన నాగరాజుకు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణపత్రం అందించారు.

వేపగుంటలో..

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని వేపగుంట గ్రామ పంచాయతీ 3వ వార్డు మెంబర్‌కు శనివారం జరిగిన ఎన్నికల్లో ఏ.భారతి తన సమీప అభ్యర్థి ఏ.ఉషా మీద 41 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎం.మలర్‌వలి ప్రకటించారు. మొత్తం 130 ఓట్లకు గాను 111 ఓట్లు పోలయ్యాయి. ఇందులో ఒక ఓటు తిరస్కరించబడగా ఒక ఓటు నోటాకు వేశారు. మిగిలిన 109 ఓట్లలో భారతికి 75, ఉషాకు 34 ఓట్లు పడ్డాయి.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ


మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, టీచర్లు

పాలసముద్రం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ద్వారానే మనిషికి మనుగడ సాగుతుందని తిరుమళరాపురం హైస్కూల్ జన విజ్ఞానవేదిన జిల్లా కార్యదర్శి సుధాకర్‌రాజు తెలిపారు. శనివారం తిరుమళరాజుపురం హైస్కూల్ విద్యార్థులు, విజయం విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలసి రోడ్డుకు ఇరువైపులా చింత, వేప, కానుగ, తంగేడు, తాటి, నేరేడు, తొమ్మిది కిలోమీటర్ల మేర 1000 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణపై గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. జన విజ్ఞానవేదిన జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వెలువడే, వ్యర్థాలు, జనాభా పెరగడం వల్ల గాలి, నీరు భూమి కలుషితమవుతున్నాయని తెలిపారు. తద్వారా కీళ్లు, నరాలకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. అందుకే బాధ్యతగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల స్టాఫ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, నవీన్‌కుమార్, మురుగదాస్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.